'రాజీవ్ యువవికాస్'కు దరఖాస్తు చేసుకోండి

కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ, ఏప్రిల్ 1: రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 14 వరకు కార్పొరేషన్‌లోని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అందుకోసం ఆధార్ కార్డు, కుల , ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, లేదా ఆహార భద్రతా కార్డు, దివ్యాంగులు ఉంటే వికలాంగుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. అదేవిధంగా విద్యార్హతలు, ట్రైనింగ్ పొందిన ధ్రువీకరణ పత్రం, రవాణా విభాగం కోసం డ్రైవింగ్ లైసెన్స్ ను తప్పనిసరిగా జతపరచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

హిమాయత్ నగర్ , ఏప్రిల్ 1: ప్రముఖ క్రైస్తవ బోధకుడు, పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జ డ్జిచే విచారణ జరి పించాలని దళిత బహుజన పార్టీ జాతీ య అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్ లోని పార్టీ కేంద్ర కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా, రాజ మహేంద్ర వరం శివారు కొంతమూరు వద్ద మార్చి 24న ప్రవీణ్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం సక్రమంగా జరగదని, రీ పోస్టుమార్టం నిర్వహించాలన్నారు. ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో చనిపోలేదని ముమ్మా టికి ప్రణాళికతోనే సంఘ్ పరివార్ సంస్థలకు చెందిన వారే హత్య చేశారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రైస్తవులు, నిమ్నజాతులపై దాడులు, హత్యలు పరంపర కొనసాగుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ గోలి నరేష్, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు సురేశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,నేతలు సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

దుండిగల్, ఏప్రిల్ 1: ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, వివిధ సంఘ సభ్యులు మంగళవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు తెలియజేయడంతో పాటు వాటిని పరిష్కరించాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందిం చిన ఎమ్మెల్సీ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 6న పలు ప్రాంతాల్లో జరగబోయే శ్రీ రామ నవమి ఉత్సవాల వేడుకల్లో పాల్గొనాలని ఆయనకు పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం అభినందనీయం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు రూ.2 లక్షల విరాళం చెక్కును అందిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 1: కూకట్‌పల్లి రామాలయంలో గరుడస్వామి ఆంజనేయస్వామి విగ్రహాల ఏర్పాటుకు విరాళాన్ని అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావుకు... దేవాలయంలో విగ్రహాల ఏర్పాటు కోసం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కూకట్‌పల్లిలో 400 ఏళ్ల చరిత్ర కలిగిన రామాలయాన్ని అద్భుతంగా పునర్ నిర్మించడం జరిగిందన్నారు. దేవాలయ ప్రాంగణంలో 27 అడుగుల గరుడస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రదర్శించేందుకు నిర్మాణ పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. ఈ పనుల కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయడం సంతోషకరమన్నారు. దాతలు, ప్రజలందరూ చల్లగా ఉండాలని కోరుకుంటున్న ట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆంజనేయులు, చైర్మన్ తులసీ రావులు ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ

మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ ప్రశాంత్‌నగర్ జేపీనగర్‌లోని రేషన్ దుకాణాల్లో పేద ప్రజలకు సన్నబియ్యం పంపిణీని మంగళవారం కార్పొరేటర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. *– మియాపూర్, ఏప్రిల్ 1*

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళ ప్రదర్శన

అల్లాపూర్, ఏప్రిల్ 1 మోతీనగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటుందని నిర్వాహకులు వినోద్ నేగి అన్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో వర్క్ గురుదేశ్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, తీరొక్క ప్ర దర్శనలు ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ చేనేత హస్తకళ ప్రదర్శన ఈ నెల 8 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్, ఏప్రిల్1 : తెలంగాణ ఉద్యమకారులకు తాము అండగా నిలుస్తామని ఉద్యమ నాయకుడిగా తనకు పూర్తి అవగాహన ఉందని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశం ఉద్యమకారులకు 250 గజాల స్థలం 25 వేల పెన్షన్స్ సౌకర్యం తోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండుతో ఏప్రిల్ 21న జరగబోయే ప్లీనరీ సమావేశానికి సంబంధించిన పోస్టర్ రిలీజ్ కార్యక్రమం మంగళవారం ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లూరి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సీ తాఫల్ మండి లో జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు జానకి రెడ్డి, రాం బాబు దయానంద్ గంగపుత్ర , జగన్ యా దవ్ ఆర్కే భూపాల్, లక్ష్మణ్, నరసింహ చారి, అమర్, సత్తన్న, నాగరాజు,శివనేత, రాజేశ్, లలిత, సరోజిని పాల్గొన్నారు..

జీడిమెట్ల హమాలి అడ్డా వద్ద చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

దుండిగల్, ఏప్రిల్ 1 : చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత హమాలీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీడిమెట్ల హమాలీ అడ్డా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీడిమెట్ల నర్సాపూర్ ప్రధాన రహదారిపై పాదచారుల దాహాన్ని తీరుస్తూ సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతున్న హమాలీ కార్మికులకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు స్వామి, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి దేవదానం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, అంజయ్య, హమాలీ సంఘం నాయకులు శీను, నరసింహారెడ్డి కరుణాకర్, మహేశ్, మల్లారెడ్డి, శేఖర్, వీరేశ్, తదితరులు పాల్గొన్నారు

బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం..

చలివేంద్రం వద్ద కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, రంగారావు

మియాపూర్ ఏప్రిల్ 1: వివేకానంద నగర్ డివిజన్ సుమిత్ర నగర్ జాతీయ రహదారిపై చైతన్యనగర్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోజా దేవి మాట్లాడుతూ.. వేసవికాలంలో బాటసారిగా దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు ..కొన్ని సంవత్సరాలుగా ఈ సంస్థ తమ సేవలను అందిస్తూ ప్రజలకు తాగునీటిని అందిస్తుండడం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత గొట్టి మొక్కల పెద్ద భాస్కరరావు, కమిటీ సభ్యులు బాలరాజు నరసింహచారి, కేఎన్ రెడ్డి, కృష్ణంరాజు యాదగిరి, అనిల్‌కుమార్, మల్లేశ్, నవీన్ చారి, బాలకృష్ణ, లక్ష్మణ్, సాయికుమార్ , తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 1: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని వడ్డెర సంఘం లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు జరిపిటి సత్యనారాయణ రాజు, వడ్డెర సంఘం తెలంగాణ (గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య డిమాండ్ చేశా రు. మంగళవారం ఉదయం చిక్కడపల్లిలో వారు మాట్లాడుతూ.. 42 శాతం రిజర్వేషన్ రాష్ట్రంలో అమలు చేయ డం జరిగిందని కేంద్రంలో కూడా త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు ఢిల్లీలో నిర్వహిస్తున్న పోరుగర్జనకు పెద్ద ఎత్తున వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు వందలాదిగా ఢిల్లీకి చేరుకోవడం జరిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా కుల గణన జరగాలని జంతర్ మంతర్ దగ్గర ధర్నాలో పాల్గొనడానికి అఖిల పక్షం నేతలు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, నగర అధ్యక్షుడు మక్కాలి వెంకటేశ్, వల్లపు లక్ష్మీనారాయణ, శివరా త్రి అంజయ్య, పల్లపు గణేశ్ , అనంతరావు, మోహన్‌కుమార్, శాంతకుమార్, వెంకట కృష్ణ పాల్గొన్నారు.

మక్త చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణం..!

మియాపూర్, ఏప్రిల్ 1: విలువైన చెరువు స్థలాల సంరక్షణలో సం బంధిత శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు . ఫలితంగా కోట్ల విలువచేసే చెరువు స్థలం కబ్జాకు గురవుతోంది. ఈ తతంగం బహిరంగంగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావు ఇస్తున్నది. మరో పక్క వరుస సెలవులను ఆసరాగా చేసుకుని చెరువు స్థలంలో వందలాది గజాల్లో చక చక అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్తమహబూబ్‌పేట్ పెద్ద కుంట చెరువులో ఎఫ్టీఎల్ సుమారు 300కు పైగా గజాల్లో ఓ వ్యక్తి ఆక్రమించి భారీ షెడ్ నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలాన్ని దశలవారీగా చదును చేసి వరుస సెలవులను దృష్టిలో పెట్టుకొని నిర్మాణం పూర్తి చేశాడు. స్థానిక నేతల అండదండలతో ఈ కబ్జా వ్యవహారానికి తెరలేపినట్టు సమాచారం. ఈ నిర్మాణంపై స్థానికులు హైడ్రాకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి ఈ అక్రమనిర్మాణంపై దృష్టి సారించి.. కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం..

జీడిమెట్ల, ఏప్రిల్ 1 : రాబోయే శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాష్‌గర్ డివిజన్, సుభాశ్‌నగర్‌లో యనమదల వెంకట్రావు, వెంకటలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు.. భక్తి శ్రద్ధలతో నృత్యాలు, కోలాటాలు చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి కాలనీ గురుదత్త క్షేత్రం ఈశ్వరరావు, గిరిబాబు, ఎంఎస్ వాసు, సత్యనారాయణ, సత్తిబాబు, భక్తులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చెత్తకుప్పలు..

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 1: ఆ దారి గుండా వెళ్లాలంటే ముక్కున చేయి వేయాల్సిందే. నిత్యం తిరిగే కాలనీలో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. అటువైపు ఏ ఒక్క అధికారి కూడా చూడడంలేదు. ఇక కిందిస్థాయి సిబ్బంది మాత్రం శర మామూలే అన్న చందంగా ఉన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్, బాపునగర్ నుంచి శ్రీరామ్ నగర్‌కు వెళ్లే ప్రధాన దారికి ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. స్థానికంగా ఉండే ప్రైవేట్ స్కూలుకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు నిత్యం ఈ చెత్తకుప్పలతో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో పేరుకుపోతున్న చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 1: అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు కోరారు. రంగారెడ్డినగర్ డివిజన్, గాంధీ నగర్ ఆస్బెస్టాస్ కమాన్ వద్ద మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగిం ది. కార్మికుల అడ్డాల్లో కనీస వసతులు, 65 ఏళ్ల వారికి రూ.పదివేల పెన్షన్ అందించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రిని కలిసి వివరిస్తామన్నారు. సమావేశంలో ఐలయ్య, రషీద్, మదన్, సాయి, యూసఫ్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు

అలరించిన సత్య హరిశ్చంద్ర నాటకం

ఫిలింనగర్‌లోని రామానాయుడు కళామండపంలో పొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్య నాటకోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం హైదరాబాద్ సురభి కళా నాట్యమండలి ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీబీ మాజీ డీజీ పూర్ణచందర్‌రావు హాజరయ్యారు. హరిశ్చంద్రుడిగా దేవనాథ్ సూరి, సురభి నిభిలేష్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకుడిగా దుర్గాప్రసాద్ ప్రధాన పాత్రల్లో ఆకట్టుకున్నారు. అనంతరం ఫీనిక్స్ ఫౌండేషన్ చైర్మన్ చుక్కపల్లి సురేష్ కళాకారులను అభినందించారు. – బంజారాహిల్స్,ఏప్రిల్ 1

సేవతోనే.. సమాజంలో గుర్తింపు

సినీనటుడు సుమన్

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: సామాజిక సేవలు సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని సినీనటుడు సుమన్ అన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు చింతల మల్లేశం గౌడ్ సేవలను గుర్తిస్తూ జర్మనీ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీనటుడు సుమన్ మల్లేశం గౌడ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లేశంగౌడ్ ఎందరో పేద విద్యార్థులకు విద్యాదానం చేశారని, విదేశీ విద్య కోసం ఆర్థిక సాయం అందించారన్నారు. రాష్ట్రంలో సుమారు 50 సర్దార్ సర్వాయి పాపన విగ్రహాలను ప్రతిష్టించారని, శ్రీశైలం, యాదాద్రిలో భక్తుల కోసం సత్రాలు నిర్మించారని తెలిపారు. జీవితాన్ని సమాజానికి అంకితం చేసిన వారిని సత్కరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల శ్రవణ్ గౌడ్, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

బొల్లారం, ఏప్రిల్ 1: మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది . ఎస్సై శివ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం .. ఓల్డ్ బోయినపల్లి లోని జామైమసీద్ వద్ద నివాసము ఉటున్న మోహద్ అబ్దుల్ రషీద్ (50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మానసిక స్థితి బాగాలేదు. అయితే గత నెల 31న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కు టుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 1 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) ఈ కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.15, వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 21, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 10, ఫ్రెంచ్ బీన్స్ 75, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 35, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 40, ఆలుగడ్డ 23, కీరా 13, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 75, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 24, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 40, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

బంజారాహిల్స్,ఏప్రిల్ 1: అకారణంగా వ్యక్తిపై కత్తితో దాడికి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లోని ఉదయ్‌నగర్‌లో నివాసం ఉంటున్న దీపక్ దాస్(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో పార్థసారథి అనే వ్యక్తితో కలిసి మంగళవారం వైరింగ్ పనులు చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి అక్కడకు వచ్చాడు. మూడో ఫ్లోర్‌లో పని కోసం వచ్చానంటూ చెప్పిన గుర్తుతెలియని వ్యక్తి కాసేపు అక్కడే నిలబడి న్యూసెన్స్ చేయడం ప్రారంభించాడు. దీంతో బయటకు వెళ్లిపోవాలంటూ దీపక్‌దాస్‌తోపాటు పార్థసారథి సూచించారు. అయితే బయటకు వెళ్లిపోకపోవడంతో పాటు అకారణంగా గొడవకు దిగాడు. దీంతో మాటామాటా పెరగడంతో పాటు తనతో తెచ్చుకున్న కత్తితో పార్థసారథి మీద దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో పార్థసారథి చేతికి గాయాలయ్యాయి. దీంతో గట్టిగా కేకలు వేయడంతో ఆగంతకుడు పారిపోయాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.